క్లుప్తంగా

ఉపాధ్యాయులకు సన్మానం


ఉపాధ్యాయులను సన్మానించిన ఎస్టీయూ నాయకులు

ప్యాపిలి: బదిలీపై ప్యాపిలి మండలానికి వచ్చిన, ఇక్కడి నుంచి వెళ్లిన ఉపాధ్యాయులకు ఎస్టీయూ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. స్థానిక ఎస్టీయూ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎస్టీయూ రాష్ట్ర సహాధ్యక్షుడు చంద్రశేఖర్ హాజరయ్యారు. ఉపాధ్యాయుల సేవలను ఆయన గుర్తు చేశారు. అనంతరం ఉపాధ్యాయులకు పూలమాలలువేసి దుశ్శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో ఎస్టీయూ రాష్ట్ర కార్యదర్శి ఇక్బాల్‌బాషా, జిల్లా సహాధ్యక్షుడు నరసింహ, జిల్లా ఉపధ్యక్షుడు వెంకటనాయక్, మండల ప్రధాన కార్యదర్శి చిన్నపరెడ్డి, హెచ్‌ఎం సురేశ్‌బాబు, ఎస్టీయూ నాయకులు రమేశ్, కిరణ్‌కుమార్, మౌలాలి, హాజీ మస్తాన్ వలి, మనోహర్, పక్కీరయ్య, మధు తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం


మృతుని భార్యకు నగదు అందజేస్తున్న గ్రామస్తులు

డోన్ టౌన్ : హైదరాబాద్‌లో పాలీష్ బండల పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్న మండలంలోని పెద్ద మల్కాపురానికి చెందిన యువకుడు మద్దిలేటిస్వామి(23) శనివారం ఆటో బోల్తాపడి మృతి చెందాడు. ఈ మేరకు ఆదివారం స్వగ్రామంలో అంత్యక్రియలు నిర్వహించారు. గ్రామస్తులు ముల్లా బాషా, రషీద్, గ్రామ యూత్ కమిటీ ఆధ్వర్యంలో తమవంతుగా రూ.10,100 నగదు మృతుని భార్య రేణుకకు అందజేశారు. అదేవిధంగా 70ఏళ్ల వృద్ధురాలు తలారి లక్ష్మి తనకు శనివారం వలంటీర్ ఇచ్చిన వృద్ధాప్య పింఛన్ నుంచి రూ.వెయ్యి బాధిత కుటుంబానికి అందజేసి ఆదర్శంగా నిలిచింది.

పేద విద్యార్థికి చేయూత


విద్యార్థికి నగదు అందజేస్తున్న దృశ్యం


డోన్ టౌన్ : పట్టణానికి చెందిన పేద విద్యార్థి చంద్రశేఖర్‌కు ప్రముఖ న్యాయవాది నాగభూషణం రెడ్డి, శైలజ దంపతుల కుమార్తె జాహ్నవి ఆర్థిక సాయం చేశారు. ఇన్నర్‌వీల్ క్లబ్ అధ్యక్ష్యురాలు కొత్రికె షాలిని ఆధ్వర్యంలో ఆదివారం విద్యార్థిక నగదు అందజేశారు. కార్యక్రమంలో క్లబ్ సభ్యులు శాంతి, పద్మ తదితరులు పాల్గొన్నారు.

కలశాలతో యాగంటి క్షేత్రానికి పాదయాత్ర


కలశాలతో యాగంటి క్షేత్రానికి పాదయాత్రకు వెళ్తున్న భక్తులు

బనగానపల్లెరూరల్: పట్టణంలోని రవ్వలకొండపై వెలసిన శ్రీహట్టిమునిస్వామి ఆలయం నుంచి ధర్మిక మండలి, విశ్వహిందూ పరిషత్, వాసవివనిత క్లబ్, శ్రీ హట్టిమునిస్వామి దేవస్థాన కమిటీ ఆధ్వర్యంలో భక్తులు కలశాలతో పాదయాత్రగా యాగంటి క్షేత్రానికి వెళ్లారు. ఈ సందర్భంగా ఉదయం 9 గంటలకు వివిధ గ్రామాల నుంచి పవిత్ర కాశీ క్షేత్రం జలంతో నింపిన కలశాలతో వచ్చిన భక్తులు శ్రీ హట్టి మునిస్వామి ఆలయం నుంచి పాదయాత్ర ర్యాలీగా బయల్దేరారు. యాగంటి క్షేత్రంలోని ఉమామహేశ్వరుడికి జాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో యాగంటి ఆలయ మాజీ చైర్మన్ తొటబుచ్చిరెడ్డి, విశ్వహిందూ పరిషత్ జిల్లా సహకార్యదర్శి దొంతా వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

7న శ్రీ చౌడేశ్వరిదేవికి చీర, సారె మహోత్సవం


శ్రీ చౌడేశ్వరిదేవి అమ్మవారు

బనగానపల్లెరూరల్: మండలంలోని నందవరం గ్రామంలో వెలసిన శ్రీ చౌడేశ్వరిదేవి అమ్మ వారికి ఈ నెల 7న చీర, సారె సమర్పణ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహిస్తున్నట్లు ఈఓ రామానుజన్ ఆదివారం తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ చెన్న కేశవ స్వామి ఆలయం నుంచి మంగళవాయిద్యాలు, భక్తుల సందడితో అమ్మవారికి చీర, సారెను భక్తులు ఊరేగింపుగా ఆలయం చేరుకొని అమ్మవారికి సమర్పిస్తారన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి ఆశీర్వాదం పొందాలని ఆయన సూచించారు.

డాక్టర్ వైఎస్ఆర్ సంచార పశుఆరోగ్య సేవ...

మూగజీవాల ఆరోగ్యానికి రక్ష !

- గ్రామాలకు వెళ్లి పశువులకు వైద్య సేవలు
- అత్యవసరమైతే సంచార వాహనంలో తీసుకెళ్లి చికిత్స
- సంతోషం వ్యక్తం చేస్తున్న పశుపోషకులు


పశువుకు వైద్య సేవలందిస్తున్న దృశ్యం (ఫైల్)

బనగానపల్లె: ప్రజారోగ్యానికి అత్యధిక ప్రాధాన్యనిస్తున్న వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మూగజీవాల ఆరోగ్య సంరక్షణకు చర్యలు చేపట్టింది. డాక్టర్ వైఎస్సార్ సంచార పశు ఆరోగ్య సేవా పథకం ద్వారా పశువులకు నాణ్యమైన వైద్య సేవలు అందజేస్తుంది. సంచార పశు ఆరోగ్య సేవా వాహనంలో డాక్టర్‌తో పాటు సిబ్బంది గ్రామాలకు వెళ్లి రైతు గుమ్మం ఎదుటే పశువులకు వైద్యం చేస్తున్నారు. గతంలో పశువులు అనారోగ్యానికి గురైనప్పుడు మండల కేంద్రాల్లోని పశువైద్యశాలలకు తీసుకెళ్లలేక పాడిరైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కున్నారు. ఎంతో పశు సపందను కోల్పోయారు కూడా. ఈ సమస్యను అధిగమించేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా డాక్టర్ వైఎస్సార్ సంచార పశు ఆరోగ్య సేవా పథకం అమలు చేపట్టారు. ఈ మేరకు బనగానపల్లె నియోజకవర్గానికి (బనగానపల్లె, సంజామల) రెండు డాక్టర్ వైఎస్సార్ సంచార పశు ఆరోగ్య సేవా వాహనాలను కేటాయించారు. బనగానపల్లె పశువైద్యశాలలకు కేటాయించిన వాహనం బనగానపల్లెతోపాటు కోవెలకుంట్ల, అవుకు మండలాల గ్రామాల్లోని పశువులకు వైద్యసేవలు అందజేస్తుంది. అదేవిధంగా సంజామలకు కేటాయించిన వాహనం ద్వారా సంజామలతోపాటు కొలిమిగుండ్ల మండలాల్లోని గ్రామాల్లో మూగజీవాలకు వైద్య సేవలు అందుతున్నాయి. డాక్టర్ వైఎస్సార్ సంచార పశు ఆరోగ్య సేవా వాహనం ఏర్పాటుతో పాడి రైతులతోపాటు మేకలు, గొర్రెల కాపరులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

బనగానపల్లె నియోజకవర్గ పశుసంపద వివరాలు	
ఆవులు	13,874
గేదెలు	72,566
గొర్రెలు	2,05,055
మేకలు	86,492

1962 టోల్ ఫ్రీ నంబరుకు సమాచారం అందజేస్తే....

మూగజీవాలు అనారోగ్యానికి గురైనప్పుడు పశుపోషకులు 1962 టోల్ ఫ్రీ నంబరుకు ఫోన్ చేయాల్సి ఉంటుంది. రైతు పేరు, గ్రామం, మండలం వివరాలతోపాటు పశువు ఆరోగ్య సమస్యను వివరించాలి. ఈ సమాచారం వెంటనే సంబంధిత రైతుభరోసా కేంద్రానికి చేరుతుంది. ఆ తరువాత డాక్టర్ వైఎస్సార్ సంచార పశు ఆరోగ్య సేవ వైద్య బృందానికి అందుతుంది. వెంటనే పశువైద్య బృందం ఆ ప్రాంతానికి వెళ్లి పశువుకు వైద్య సేవలు అందిస్తారు. అత్యవసర పరిస్థితి ఉంటే పశువును వాహనంలో సమీప పశువైద్యశాలకు తీసుకెళ్లి పూర్తిస్థాయిలో చికిత్స చేస్తారు. అనంతరం పశువును రైతు ఇంటికి ఉచితంగా చేర్చడం జరుగుతుంది.

సత్వర వైద్య సేవలు

డాక్టర్ వైఎస్సార్ సంచార పశు ఆరోగ్య సేవా వాహనం ద్వారా అనారోగ్య పశువుకు వ్యాధి నిర్ధారణ చేసి ఖచ్చితమైన నాణ్యమైన పశు వైద్యం అందిస్తారు సిబ్బంది. ఆయా ప్రాంతాల్లో పశువ్యాధుల వ్యాప్తి నిర్మూలన అంశాలను అంచనా వేస్తారు. అదేవిధంగా కృత్రిమ గర్భోత్పత్తి సేవలు అందించడం జరుగుతుంది. సీజనల్ వ్యాధుల గురించి అవగాహన కల్పించడం పశుయాజమాన్యంపై సూచనలు సలహాలు ఇచ్చి పశు పోషకులను చైతన్య పరుస్తారు.


డాక్టర్ వైఎస్సార్ సంచార పశుఆరోగ్య సేవ రథం

పశువుల ఆరోగ్యానికి భరోసా



డాక్టర్ వైఎస్సార్ సంచార పశు ఆరోగ్య సేవ పథకం పశువుల ఆరోగ్యానికి భరోసా కల్పిస్తుంది. గతంలో పశువులు అనారోగ్యానికి గురైనప్పుడు చాలా ఇబ్బందులు పడ్డాం. దూరప్రాంతాల్లో ఉన్న పశువైద్యశాలలకు పశువులు తీసుకెళ్లలేక నష్టపోయాం. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అమలు చేస్తున్న ఈ పథకం రైతులకు, గొర్రెలు, మేకల కాపరులకు ఎంతో ఉపయోగకరం.

– సాయిబాబా, మెట్టుపల్లి, అవుకు మండలం

గ్రామాలకు వెళ్లి వైద్య సేవలు అందిస్తున్నాం



మూగజీవాల ప్రాణాలకు డాక్టర్ వైఎస్సార్ సంచార పశు ఆరోగ్య సేవ పథకం రక్షణ కవచం. గ్రామాలకు వెళ్లి పశువులకు వైద్య సేవలు అందిస్తున్నాం. ప్రతినెలా గ్రామాలకు వెళ్లి 175–200 పశువులకు వైద్యం చేస్తున్నాం. పశువు తీవ్ర అనారోగ్యంగా ఉంటే వెంటనే వాహనంలో సమీప పశువైద్యశాల కు తీసుకెళ్లి పూర్తి స్థాయిలో వైద్యం చేస్తున్నాం. పశుపోషకులకు సూచనలు చేస్తున్నాం.

– డాక్టర్ తస్లీమా నస్రున్, డాక్టర్ వైఎస్సార్ సంచార పశు ఆరోగ్య సేవ వైద్యురాలు

నేడు గడప గడపకు మన ప్రభుత్వం

సంజామల : మండల పరిధిలోని ముక్కమల్ల గ్రామంలో సోమవారం సాయంత్రం 3 గంటలకు గడప గడపకు మనప్రభుత్వం కార్యమాన్ని నిర్వహిస్తున్నాట్లు కర్నూలు ఉమ్మడి జిల్లాల రీజనల్ కో ఆర్డినేటర్ పొచా శీలా రెడ్డి, జిల్లా ప్రచార కార్యదర్శి సిద్దంరెడ్డి రాంమ్మెహన్ రెడ్డి తెలిపారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి హాజరవుతారన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించడంతో పాటు ప్రజల సమస్యలు తెలుసుకుని పరిష్కార చర్యలు చేపడుతారన్నారు. సర్పంచ్‌లు, ఎంపీటీసీల సభ్యులు, నాయకులు, కార్యకర్తలు కార్యక్రమాని తరలిరావాలని పిలుపునిచ్చారు.

వ్యవసాయానికి విద్యుత్ సరఫరా వేళలు

కోవెలకుంట్ల: మండలంలోని ఫీడర్ల పరిధిలో సోమవారం నుంచి వ్యవసాయ రంగానికి పగటి వేళల్లో తొమ్మిది గంటల విద్యుత్ సరఫరా చేస్తున్నట్లు ఏడీఈ ఖాజావలీ చెప్పారు. కోవెలకుంట్ల, గుళ్లదూర్తి, కలుగొట్ల విద్యుత్ సబ్‌స్టేషన్ల ఫీడర్ల పరిధిలో విద్యుత్ సరఫరా వేళలను తెలియజేశారు. జోళదరాశి, భీమునిపాడు, అమడాల, గుంజలపాడు, గుళ్లదూర్తి, పొట్టిపాడు, హరివరం, కొత్తపల్లె, అల్లూరు, రేవనూరు, కలుగొట్ల, కొప్పెర్ల ఫీడర్ల పరిధిలోని గ్రామాల్లో ఉదయం 8 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉంటుందని ఆయన వివరించారు.

జగనన్న సురక్ష గ్రామసభల షెడ్యూల్

కోవెలకుంట్ల: మండలంలోని సచివాలయాల పరిధిలో 29వ తేదీ వరకు జగనన్న సురక్ష గ్రామ సభలు ఏర్పాటు చేసినట్లు ఎంపీడీఓ రాధిక తెలిపారు. 4వ తేదీన బిజనవేముల గ్రామ సచివాలయం, 6న చిన్నకొప్పెర్ల, 11న గుళ్లదూర్తి, 13న కలుగొట్ల, 15న కోవెలకుంట్ల –1, 18న కోవెలకుంట్ల –2, 20న కోవెలకుంట్ల –3, 22న కోవెలకుంట్ల –4, 25న కోవెలకుంట్ల –5, 27న రేవనూరు, 28వ తేదీన సౌదరదిన్నె గ్రామ సచివాలయాల పరిధిలో సభలు కొనసాగుతాయన్నారు. అర్హులందరికీ పథకాల వర్తింపే లక్ష్యంగా ఈ కార్యక్రమం చేపట్టామని, ప్రజలుసద్వినియోగం చేసుకోవాలన్నారు.

రేనాటిగడ్డ ఖ్యాతి చాటిన బీవీ

- ఉపముఖ్యమంత్రిగా, స్పీకర్ పదవులకు వన్నె తెచ్చిన బీవీ సుబ్బారెడ్డి
- రేపు 120వ జయంతి


బీవీ సుబ్బారెడ్డి(ఫైల్)

కోవెలకుంట్ల: దివంగత బీవీ సుబ్బారెడ్డి పేరు చెప్పగానే రేనాటి గడ్డగా పేరొందిన కోవెలకుంట్ల ప్రాంతం గుర్తుకొస్తుంది. పట్టణానికి చెందిన బీవీ ఉప ముఖ్యమంత్రిగా, స్పీకర్‌గా పదవులకు వన్నె తెచ్చారు. 1952లో నియోజకవర్గం ఏర్పడి మొదటిసారిగా శాసనసభ ఎన్నికలు జరిగాయి. 1955లో బీవీ సుబ్బారెడ్డి ఇండిపెండెంట్‌గా పోటీ చేసి కాంగ్రెస్ అభ్యర్థి పెండేకంటి వెంకట సుబ్బయ్యపై విజయం సాధించారు. 1962లో కాంగ్రెస్‌పార్టీ తరఫున ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. 1967లో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీచేసి ఇండిపెండెంట్ అభ్యర్థి కొత్రపాటి రామిరెడ్డిపై గెలుపొంది హ్యాట్రిక్ సాధించారు. బీవీ హయాంలో చాలా ప్రాంతాల్లో గ్రామీణులు రోడ్లు, విద్యుత్ సౌకర్యం పొందారు. కోవెలకుంట్ల నియోజకవర్గం నుంచి ఐదు పర్యాయాలు ఎమ్మెల్యే గెలుపొందిన బీవీ ఉపముఖ్యమంత్రిగా, స్పీకర్‌గా ప్రజలకు సేవలందించారు. పట్టణంలో మంగళవారం బీవీ 120 జయంతిని ఘనంగా నిర్వహించేందుకు ఆయన వంశస్తులు ఏర్పాట్లు చేస్తున్నారు.

నేడు గురు పౌర్ణమి వేడుకలు



కొలిమిగుండ్ల: మండలంలో సోమవారం గురుపౌర్ణమి వేడుకలను పెద్ద ఎత్తున నిర్వహించేందుకు నిర్వాహకులు ఏర్పాట్లు పూర్తి చేశారు. కొలిమిగుండ్లలోని షిర్డీసాయి మందిరంలో షిర్డీసాయి సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉదయం స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. సాయంత్రం నుంచి షిర్డీసాయి పంక్షన్ హాల్‌లో మయ సభ ఏకపాత్రాభినయం, భక్తిగీతాల పోటీలు నిర్వహించనున్నారు.

బేతంచెర్ల : పట్టణానికి సమీపాన కర్నూలు రహదారిలో వెలసిన షిరిడీ సాయిబాబా ఆలయంలో సోమవారం గురుపూర్ణిమ వేడుకలను నిర్వహిస్తునట్లు సాయిభక్త బృందం సభ్యులు తెలిపారు. బాబాకు ప్రత్యేక పూజలు నిర్వహిస్తామని, భక్తులు పాల్గొని సాయి ఆశీర్వాదాలు పొందాలని సూచించారు. అలాగే నంద్యాల రహదారిలోని వీరబ్రహ్మేంద్ర పిరమిడ్ ధ్యాన మందిరం 11వ వార్షికోత్సవం, గురుపూర్ణిమ వేడుకలు నిర్వహిస్తున్నట్లు పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీ నిర్వాహకులు తెలిపారు.

సన్మానం


రిటైర్డ్ ఆర్మీ ఉద్యోగులను సన్మానిస్తున్న దృశ్యం

బేతంచెర్ల: పట్టణంలోని అమ్మవారిశాలలో వాసవీ, వనితా క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు బళ్లాని సూర్య, గుప్త, ఉమాదేవి, మణి ఆధ్వర్యంలో దాన్‌టూ డస్క్ –2023 కార్యక్రమంలో భాగంగా కరోనా సమయంలో సేవలు అందించిన రిటైర్డ్ ఆర్మీ ఉద్యోగులు బషీర్, మబూసా, లక్ష్మీనారాయణను ఘనంగా సన్మానించారు. అలాగే బిక్షాటన చేస్తూ సమాజ అభివృద్ధి తోడ్పాటు అందిస్తున్న శివ రామయ్యను సత్కరించారు. కార్యక్రమంలో వాసవీ క్లబ్ ఇంటర్ నేషనల్ డైరక్టర్ నారాయణం తులసి స్వప్న, ప్రోగ్రామ్ కో ఆర్డినేటర్ కంద గడ్డల మోహన్ రావు వాసవీ క్లబ్ జోనల్ చైర్మన్ ధనుంజయ, కోశాధికారి రమణ, క్లబ్ సభ్యులు రాజు, విష్ణు, సురేష్ పాల్గొన్నారు.

ఉపాధి పథకాన్ని నిర్వీర్యం చేస్తున్న కేంద్రం

డోన్ టౌన్ : ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో తక్కువ నిధులు కేటాయించడంతో పాటు లేనిపోని ఆంక్షలు విధిస్తోందని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రాధకృష్ణ విమర్శించారు. స్థానిక నక్కి రామన్న భవన్‌లో ఆదివారం నిర్వహించిన జనరల్ బాడీ సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రం తన భాధ్యతల నుంచి తప్పుకోవడానికి రాష్ట్రాలను భాగస్వామ్యం పేరుతో నిధులకు కుదించడానికి ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు. అనంతరం నూతన కార్యవర్గం ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా విజయుడు, కార్యదర్శిగా వరదరాజులు, ఉపాధ్యక్షుడిగా రంగస్వామి, సహాయ కార్యదర్శులుగా మనోహర్, రామాంజనేయులుతో పాటు 19మంది కమిటీ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

హైదరాబాద్‌కు వెళ్లి పింఛన్ అందజేత


హైదరాబాద్‌లో నారాయణకు పింఛన్ నగదు అందజేస్తున్న వలంటీర్ శ్రీనివాసులు


కర్నూలులో గుర్రప్పకు పింఛన్ సొమ్ము అందజేస్తున్న వలంటీర్ ప్రసాద్

సంజామల/కొలిమిగుండ్ల:: పింఛన్ పంపిణీ రెండవ రోజు ఆదివారం సాగింది. వలంటీర్ల లబ్ధిదారుల ఇళ్ల వద్దకు వెళ్లి పింఛన్ నగదు అందజేస్తున్నారు. అనారోగ్య పరిస్థితుల కారణంగా ఇతర ప్రాంతాల్లో ఉన్నవారి వద్దకు వెళ్లి పింఛన్ అందజేస్తుండడంతో వలంటీర్లకు లబ్ధిదారులు కృతజ్ఞతలు తెలుపుతున్నారు. సంజామల మండల పరిధిలోని రామిరెడ్డిపల్లెకు చెందిన పింఛన్ లబ్ధిదారుడు కోడూరు నారాయణ అనారోగ్యంతో హైదరాబాద్‌లో చికిత్స పొందుతున్నాడు. స్పందించిన వలంటీర్ శ్రీనివాసులు అక్కడికి వెళ్లి కోడూరు నారాయణకు పింఛన్ నగదు అందజేశారు. ప్రభుత్వంతో పాటు వలంటీర్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

– అంకిరెడ్డిపల్లెకు చెందిన మచ్చ గుర్రప్ప వారం రోజుల నుంచి అనారోగ్య సమస్యతో కర్నూలులోని ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. వలంటీర్ ప్రసాద్ ఆదివారం కర్నూలుకు వెళ్లి వృద్ధాప్య పింఛన్ సొమ్ము అందజేశాడు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న తమకు పింఛన్ సొమ్ము తీసుకొచ్చి ఇవ్వడం సంతోషంగా ఉందని గుర్రప్ప చెప్పారు. ఈసొమ్ము ఖర్చులకు ఉపయోగపడుతుందరి గురప్ప సంతోషం వ్యక్తం చేశారు.

ప్రజల చెంతకే పాలన ప్రభుత్వ లక్ష్యం

- అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాల వర్తింపు
- సాంకేతిక సమస్యలలో లబ్ధిపొందని పేదలను గుర్తించేందుకే జగనన్న సురక్ష
- గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే కాటసాని, జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల


చాకలి సురేంద్ర కుటుంబానికి ఏకంగా రూ. 6.51 లక్షల లబ్ధి చేకూరడంతో వివరాల బుక్‌లెట్‌ను లక్ష్మీదేవికి అందజేస్తున్న ఎమ్మెల్యే కాటసాని, జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల

కొలిమిగుండ్ల: ప్రజల చెంతకే పాలన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ లక్ష్యమని, ఆ దిశగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సచివాలయ, వలంటీర్ వ్యస్థలను తీసుకొచ్చారని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి పేర్కొన్నారు. సాంకేతిక, ఇతర కారణాల మూలంగా ఏ ఒక్క పేద ప్రభుత్వ సంక్షేమ పథకాలకు దూరం కాకుడదనే సదుద్దేశంతో సీఎం ప్రతిష్టాత్మకంగా జగనన్న సురక్ష కార్యక్రమాన్ని చేపట్టారని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మండల పరిధిలోని కల్వటాల గ్రామంలో ఆదివారం ఎమ్మెల్యే, జెడ్పీ చైర్మన్ గడప గడపకు మన ప్రభుత్వం కార్యమాన్ని నిర్వహించారు. అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి గ్రామంలో విస్తృతంగా పర్యటించారు. గడప గడపకూ వెళ్లి ప్రభుత్వ పాలన తీరును వివరించడంతో పాటు ప్రజలతో మాట్లాడి సమస్యలపై ఆరా తీశారు. ఆయా కుటుంబాలకు ప్రభుత్వం నుంచి వర్తించిన సంక్షేమ పథకాల వివరాల బుక్‌లెట్‌లను లబ్దిదారులకు అందజేశారు. బుక్‌లెట్‌లోని వివరాల మేరకు సంక్షేమ పథకాలు అందాయాల.. లేదా అని ఆయా కుటుంబాల సభ్యులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ పార్టీలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అందజేస్తున్న ఘనత జగనన్న ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. ఇంతవరకు ఏ ప్రభుత్వం చేయని విధంగా ప్రజల వద్దకు నేరుగా ప్రజాప్రతినిధులు వచ్చి సమస్యలు తెలుసుకుంటూ పరిష్కార చర్యలు చేపడుతున్నామని గుర్తు చేశారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో జన్మభూమి కమిటీలకు పెత్తనం అప్పగించి ప్రజలకు అన్యాయం చేశారని విమర్శించారు. ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందాయని, ఏదైనా సమస్యతో ప్రభుత్వ పథకాల లబ్ధి చేకూరని అర్హులను గుర్తించి న్యాయం చేసేందుకు జగనన్న రక్ష కార్యక్రమాన్ని చేపట్టామని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రజల వద్దకే పాలన కొనసాగించేందుకు మరోమారు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని ఆశీర్వాదించాలని వారు కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ గ్రామ నాయకులు కామిని తిమ్మారెడ్డి, కామిని గోపాల్‌రెడ్డి, రామచంద్రారెడ్డి, గెబు, అమర్‌నాథ్‌రెడ్డి, మద్దిలేటి, ఉప సర్పంచ్ గుత్తి చిన్నన్న, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు అంబటి గుర్విరెడ్డి, జిల్లా పబ్లిసిటీ వింగ్ అధ్యక్షుడు పేరం సత్యనారాయణరెడ్డి, జిల్లా సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు లాయర్ మహేశ్వరరెడ్డి, నందిపాడు సర్పంచ్ గుర్విరెడ్డి, ఎంపీడీఓ ప్రసాదరెడ్డి, తహసీల్దార్ దోనీ ఆల్‌ఫ్రెడ్, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

హోరెత్తుతున్న మైకుల శబ్దాలు!


తోపుడు బండిపై ఏర్పాటు చేసిన బైక్

డోన్ టౌన్ : పట్టణంలో ఇటీవల తోపుడు బండ్లపై చిరు వ్యాపారస్తులు ఏర్పాటు చేసుకున్న మైకులు శబ్దాలు హోరెత్తుతున్నాయి. వస్తువులు, పండ్లు తదితరవాటి పేర్లు, ధరలు వివరాలను తెలిపే శబ్దాలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. పట్టణంలోని రైల్వే గేట్ల వద్ద నుంచి కూరగాయల మార్కెట్ మీదుగా పాత బస్టాండ్, రైల్వే స్టేషన్ రోడ్డుతో పాటు కొత్త బస్టాండ్ వైపు దారిలో ఉన్న స్టేట్ బ్యాంక్, శ్రీరామ థియేటర్ వరకు పెద్ద సంఖ్యలో తోపుడు బండ్లు పెట్టుకొని చిరు వ్యాపారస్తులు వ్యాపారాలు నిర్వహిస్తున్నారు. అయితే మైకుల శబ్దాలు కారణంగా ద్విచక్ర, ఇతర వాహనదారులు, బాటసారులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ఎక్కడి నుంచి ఏ వాహనం వస్తుందో అర్థమవ్వక తికమక పడుతున్నారు. అధునిక సాంకేతికను ఉపయోగించడం మంచిదే కాని ఇతరులకు ఇబ్బందులు ఏర్పడే విధంగా వ్యవహరించడం సరైంది కాదని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. పోలీసులు స్పందించి మైకుల శబ్దాలను నియంత్రించాలని ప్రజలు కోరుతున్నారు.

బేతంచెర్లలో భారీ వర్షం

బేతంచెర్ల: మండలంలో ఖరీఫ్ ప్రారంభమై నెల అవుతున్నా సరైన వర్షం లేక రైతన్నలు ఆందోళన చెందుతున్న తరుణంలో మండల కేంద్రం బేతంచెర్లతో పాటు గ్రామాల్లో ఆదివారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. దీంతో రైతన్నలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. సాగుకు సరిపడిన వర్షం కురవడంతో విత్తన్నం విత్తేందుకు సిద్ధం అవుతున్నారు.

కొలిమిగుండ్లలో మోస్తరు...

కొలిమిగుండ్ల: వాతావరణంలో మార్పులతో ఆదివారం ఉదయం నుంచి ఉక్కపోతగా ప్రజలు ఇబ్బంది పడ్డారు. రాత్రి ఒక్క సారిగా ఆకాశంలో మబ్బులు కమ్ముకుని మండలంలోని పలు గ్రామాల్లో మోస్తరు వర్షం కురిసింది. ఖరీఫ్‌కు సీజన్ సాగుకు పొలాలను సిద్ధం చేసుకున్న రైతులు వర్షం కోసం ఎదురు చూస్తున్నారు. ఎట్టకేలకు వరుణుడు కరుణించడంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

ప్రజలకు మెరుగైన సౌకర్యాలు


కాల్వ పనులను పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్

డోన్ టౌన్ : ప్రజలకు మరింత మెరుగైన సౌకర్యాలు కల్పిస్తామని మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్ అన్నారు. పట్టణంలోని నల్లగుట్ట ప్రాంతంలో ఇటీవల కురిసిన వర్షాల కారణంగా నిలిచిన వర్షం నీటిని, బురుదను ఆదివారం తొలగించే కార్యక్రమాన్ని ఆయన కమిషనర్ వెంట్రామిరెడ్డితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా జేసీబీతో వర్షం నీరు నిల్వ ఉండకుండ తత్కాలిక కాలువ ఏర్పాటు చేయించి పారిశుద్ధ్య పనులను చేయించారు. వీరి వెంట బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు పోస్టు ప్రసాద్,కౌన్సిలరు శరత్ తదితరులు ఉన్నారు.

కారు బోల్తా .... ముగ్గురికి గాయాలు

డోన్ టౌన్ : మండల పరిధిలొని కొత్తకొట గ్రామ సమీపంలొని జాతీయ రమదారిపై కారు అదుపు తప్పి బోల్తా పడడంతో ముగ్గరికి గాయాలయ్యాయి. అనంతపురం జిల్లాకు చెందిన ఐదుగురు స్నేహితులు కారులో శ్రీశైలం వెళ్తుండగా ఈ ప్రమాదం చోటు చేకుంది. గాయపడిన వంశీకృష్ణ, మణీంద్ర, మహేష్‌లను చికిత్సల నిమిత్తం డోన్‌లోని ఒక ప్రైవేట్ వైద్యశాలకు తరలించారు.

టిప్పర్‌ఢీకొని వ్యక్తికి...

డోన్ టౌన్ : పట్టణంలోని ఇందిరానగర్‌కు చెందిన కనుమన్నను టిప్పర్ ఢీకొనడంతో తీవ్ర గాయాలు అయ్యాయి. స్థానికుల సమాచారం మేరకు ఆదివారం రాత్రి కనుమన్న కంభాలపాడు సర్కిల్ ఈద్గ మజీద్ వద్ద వెళ్తుండగా టిప్పర్ డ్రైవర్ ఢీకొట్టి ఆపకుండ వెళ్తున్నాడు. గమనించిన స్థానికులు కొందరు టిప్పర్‌ను వెంబడించి నిలిపివేశారు. గాయపడిన కనుమన్నను చికిత్సల నిమిత్తం డోన్ ప్రభుత్వ వైద్యశాలకు తరలించామని చెప్పారు.

రేపు 'జగనన్న సురక్ష'

బనగానపల్లెరూరల్: మండలంలోని కైప, మీరాపురం గ్రామాల్లో ఈ నెల 4వ తేదీన జగనన్న సురక్ష కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు ఎంపీడీఓ శివరామయ్య తెలిపారు. అర్హత ఉండి ఇంకా ప్రభుత్వ పథకాలు అందనివారు, ఆదాయ కులధ్రువీ కరణ సర్టిఫికెట్లు, ఆధార్ కార్డులో మార్పులు, రేషన్‌కార్డులో పేర్ల మార్పు తదితర 11 రకాల ప్రభుత్వ సేవలకు సంబంధించిన వివరాలను పరిశీలించి వెంటనే సర్టిఫికెట్లు ఉచితంగా అందజేయనున్నట్లు ఎంపీడీఓ తెలిపారు. కార్యక్రమాన్ని ఆయా గ్రామాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ సూచించారు.

కార్మికునికి ఆర్థిక సాయం

డోన్ టౌన్ : భవన నిర్మాణ పనుల్లో గాయపడిన కార్మికుడు జయప్పకు ఆర్‌సీసీ యూనియన్ నాయకులు సుధాకర్ నాయుడు, పుల్లయ్య ఆధ్వర్యంలో ఆదివారం రూ. 5 వేలు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు నిరంజన్, రహిమాన్, అర్జున్, బాషా, సురేంద్ర, హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.